క్లుప్తంగా

తల్లిదండ్రులకు చిన్నారి అప్పగింత



పొదలకూరు: తప్పిపోయిన బాలికను పోలీసులు తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. రాపూరు మండలం రేగడపల్లి గ్రామ ఎస్టీ కాలనీకి చెందిన కుమారి, నాగార్జున దంపతులకు కౌషిక (5) అనే కుమార్తె ఉంది. ఆదివారం తండ్రితో వచ్చిన బాలిక పొదలకూరు మండలం వనం తోపు వద్ద తప్పిపోయింది. పోలీసులకు ఫిర్యాదు అందడంతో వెంటనే స్పందించి గాలించారు. అదే ప్రాంతంలో ఉన్న బాలికను గుర్తించి తల్లిదండ్రులకు రాత్రి అప్పగించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

కోవూరు: కోవూరు పాత సబ్‌స్టేషన్ పరిధిలో పెద్ద పడుగుపాడు, గంగవరం, పోతిరెడ్డిపాళెం, స్టాఫ్‌బీడీ కాలనీ, కొనమ్మతోపు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.మధుసూదనరెడ్డి సోమవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీపీఎం నాయకుల పరామర్శ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక చిన్న మస్తానయ్య ఆత్మహత్య చేసుకున్న క్రమంలో ఆయన కుటుంబ సభ్యులను సోమవారం సీపీఎం నాయకులు పరామర్శించారు. మృతుడి భార్య మంగమ్మతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు గండవరపు శ్రీనివాసులు మాట్లాడుతూ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి కుటుంబానికి అండగా నివాలని కోరారు.

'నమ్మించి నగదు కాజేశారు'

• గిరిజన మహిళా ఆవేదన



మాట్లాడుతున్న మారతమ్మ

కోవూరు: గిరిజన సంఘాల నాయకులు తనను నమ్మించి నగదు కాజేశారని కోవూరు మండలం గాంధీ జనసంఘానికి చెందిన ఈగ మారతమ్మ అనే గిరిజన మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం రాత్రి కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులోని వివరాల మేరకు.. మారతమ్మ భర్త 2020లో మరణించగా అందుకు సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.8 లక్షలు రావాల్సి ఉంది. ఈ క్రమంలో 2023లో ఆ నగదు ఆమె బ్యాంక్ అకౌంట్‌లో జమయ్యాయి. కాగా నగదు డ్రా చేసేందుకు వచ్చిన గిరిజన నేతలు కేసీ పెంచలయ్య, ఉషా ఆ మొత్తం వేరే వారికి చెందినదని నమ్మించి తీసుకున్నారు. ఈ క్రమంలో భర్త కుటుంబ సభ్యులు వచ్చి ఆ నగదు ఏమైందని నిలదీయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు తనకు న్యాయం చేయాలని ఆమె పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా సంఘాలకూ ప్రశంసా పత్రాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల్లో క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు ఇచ్చి గౌరవించే విధంగా ఉత్తమ క్రీడా సంఘాలను సైతం ప్రభుత్వం గుర్తిస్తోందని మాజీ రంజీ క్రీడాకారుడు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి తెలిపారు. నెల్లూరులోని శాంతినగర్‌లో ఉన్న తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం క్రీడా సంఘాలు ఖచ్చితంగా 'శాప్' గుర్తింపు కలిగి ఉండాలన్నారు. మూడు కేటగిరిల్లో ప్రశంసా పత్రాలను అందజేస్తారన్నారు.

20న భగవద్గీత శ్లోకాల రాత పోటీలు

నెల్లూరు(బృందావనం): ఈనెల 20న త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో నగర పరిధిలోని పాఠశాల విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల రాత పోటీలు ఉంటాయని ఆ వేదిక నగర కమిటీ అధ్యక్షుడు డి.సురమౌళి తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన మోడల్ ప్రశ్నపత్రాన్ని నగరంలోని 21 ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులకు సోమవారం అందజేశారు. ఈ పోటీలు 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్నామన్నారు. డైకస్‌రోడ్డు సెంటర్‌లోని ఓవెల్ విన్‌లైట్ స్కూల్ ఎదురుగా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాల కోసం 79899 75473, 90007 56954 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నిత్యం ట్రాఫిక్ సమస్యలే..



పంచాయతీ బస్టాండ్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు

పొదలకూరు: పట్టణంలో పంచాయతీ బస్టాండ్, మెయిన్‌రోడ్డు రద్దీగా మారాయి. నాలుగు మండలాలకు చెందిన వాహనాలు పొదలకూరుకు వస్తుంటాయి. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో పట్టణం మీదుగానే రాకపోకలు సాగించాలి. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. దీనికితోడు యువకులు అడ్డగోలుగా ద్విచక్ర వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. వృద్ధులు, మహిళలు మెయిన్‌రోడ్డుపై వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పంచాయతీ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు ఆగి వెళుతున్నందున నిత్యం ట్రాఫిక్ ఉంటోంది. ఇక్కడ పిక్‌పాకెటర్లు చేతివాటం ప్రదర్శిస్తుంటారు. ఇటీవల దొంగ ఓ రైతుకు చెందిన నగదును తస్కరించాడు. స్థానికులు గుర్తించి తరుముకోవడంతో సమీపంలోని ఇంట్లో డబ్బును పడేసి వెళ్లాడు. బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఉన్నందున దొంగ ఎటువైపు వెళ్లాడో పోలీసులు తెలుసుకోగలిగారు. అయితే ఈ ప్రాంతంలో కెమెరాల సంఖ్యను ఇంకా పెంచితే నేరాలను అరికట్టేందుకు వీలుంటుందని పోలీసులు భావిస్తున్నారు.

ఇష్టానుసారంగా..

పట్టణంలోని మెయిన్ రోడ్లపై కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రెండు భారీ వాహనాలు సైడ్ తీసుకోలేని పరిస్థితి నెలకొంటోంది. కొందరైతే తమ కార్లను రోడ్ల మీదనే పార్కింగ్ చేసి గంటల తరబడి పనులు చక్కబెట్టకుని వెళుతున్నారు. ఇందువల్ల ట్రాఫిక్ స్తంభించి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్‌లో దుకాణాలు ముందుకు జరిపి వస్తుండటంతో బస్సులు నిలిపినా ప్రయాణికులకు సమస్యగా మారుతోంది. ఇలా చాలాకాలంగా ఉన్నా పట్టించుకునే వారు లేరు. తరచూ పోలీసు అధికారులు దుకాణదారులను హెచ్చరించి వెనక్కు సర్దుబాటు చేస్తున్నా తిరిగి యథావిధిగా ముందుకొస్తున్నారు.



అడ్డగోలుగా మెయిన్‌రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన వాహనాలు

వెంకటకృష్ణారావు సేవలు మరువలేనివి



వెంకటకృష్ణారావు చిత్రపటం వద్ద నివాళులర్పించిన విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: సాహిత్య, సాంస్కృతిక, సేవా, విద్య, రాజకీయ రంగాల్లో మండలి వెంకటకృష్ణారావు సేవలు మరువలేనివని బుచ్చిరెడ్డిపాళెం గ్రంథాలయాధికారి నరసింహారావు అన్నారు. పట్టణంలోని పంచాయతీ గ్రంథాలయంలో వెంకటకృష్ణారావు జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నరసింహారావు మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభలను ప్రారంభించడం, అంతర్జాతీయ తెలుగు మండలిని ప్రారంభించిన ఘనత కృష్ణారావుకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ..

కొడవలూరు: మండలంలోని రెడ్డిపాళెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు కొడవలూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఏ షఫీఉద్దీన్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల బారిన పడకుండా దోమతెరలు వాడుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుష్మ, ఏఎన్‌ఎం నదియ, ఆశా కార్యకర్త పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముత్తుకూరు(పొదలకూరు): పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ నిధులను గ్రామాల ప్రజలకు ఖర్చు చేయాలని డిమాండ్ చేస్తూ మండల సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గడ్డం అంకయ్య మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మత్స్యకారేతర ప్యాకేజీ బ్యాలెన్స్ నిధులను అందజేయాలన్నారు. కాలుష్య కోరల్లో మగ్గుతున్న ప్రజలకు 30 కిలోల బియ్యం, రూ.3 వేలు నగదు అందజేయాల్సిందిగా కోరారు. స్థానికులకు పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలని అన్నారు. తహసీల్దార్ స్వప్నకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏడుకొండలు, పద్మ, ఉమా, మస్తానమ్మ, పోలమ్మ, ముత్యాలమ్మ, ఆదెమ్మ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణకు డిమాండ్



మాట్లాడుతున్న ప్రసాద్

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ డ్రైవర్ల అసోసియేషన్ నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ పూర్తి స్థాయి విచారణ జరపాలని జిల్లా పరిషత్ కార్యాలయ డ్రైవర్ పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పలువురు ప్రభుత్వ డ్రైవర్లతో కలిసి కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ నుంచి గతంలో డ్రైవర్స్ అసోసియేషన్‌కు భవనం కేటాయించారన్నారు. తర్వాత కాలంలో అక్కడ ఏర్పడిన మొత్తం 24 షాపుల ద్వారా నెలకు రూ.2.40 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. డ్రైవర్స్ అసోసియేషన్ నాయకుడిగా ఉన్న చిరంజీవి గత 15 ఏళ్ల నుంచి లెక్కలు చూపలేదన్నారు. ఆడిట్ కూడా జరపలేదన్నారు. ప్రస్తుతం లెక్కలు చూపకుండా చిరంజీవి రిటైర్డ్ అయిన నేపథ్యంలో ఆయనపై సమగ్ర విచారణ జరపాలన్నారు. అలాగే కొంతకాలంగా ఆగిపోయిన తమ అసోసియేషన్‌కు తక్షణమే ఎన్నికలు జరిపి కొత్త కార్యవర్గం ఎన్నుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ డ్రైవర్లు ఎస్.కృష్ణ, సురేష్, సాయి, చిట్టిబాబు, శివప్రసాద్, వేల్పుల శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి



నూతన కమిటీ సభ్యులకు సన్మానం

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్‌ఎంల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వీకేఎస్ జయలక్ష్మి అన్నారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో ప్రమోషన్లు లేకుండా ఏఎన్‌ఎంలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా టి.సౌందర్య, ఉపాధ్యక్షులుగా ఎ.అనిత, పి.విజయ, పి.రమణమ్మ, జి.రియాన, వి.ఉమామహేశ్వరి, కార్యదర్శిగా వి.హైమావతి, సహాయ కార్యదర్శిగా నిర్మల, జె.జయశీల, జె.పద్మ, కేవీ రమణ, విజయపద్మ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఉమామహేశ్వరి, కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా జి.వరలక్ష్మిలను ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా అధ్యక్షురాలుగా కంభం సుగుణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జ్యోతిర్మయి, ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి సోమవారం త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవాసమితి సభ్యులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణుని గొప్పతనం, గీతా సారాంశం గురించి తెలుకోవడం ద్వారా జీవితంలో అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలు నేడు

వెంకటాచలం: మండంలోని సరస్వతీనగర్ వద్దనున్న అక్షర విద్యాలయంలో మంగళవారం ఉదయం 8:30 గంటలకు క్లస్టర్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం కానున్నాయి. కలెక్టర్ ఆనంద్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారు.

పొదలకూరులో చిరుజల్లులు

పొదలకూరు: పట్టణ చుట్టుపక్కల ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఓవైపు వాన, మరోవైపు ఎండ కాసిందని స్థానికులు చెబుతున్నారు. కొద్దిరోజులుగా విపరీతమైన ఉక్కపోత కారణంగా ప్రజలు అల్లాడుతున్నారు. ఆగస్టు నెలలోనూ ఎండలు అధికంగా ఉన్నాయి. స్వల్పంగా కురిసిన వర్షం వల్ల ఎలాంటి ఉపయోగం లేదంటున్నారు.

ఏఎంసీ పాలకవర్గ బాధ్యతల స్వీకరణ

వెంకటాచలం: సర్వేపల్లి ఏఎంసీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమం సోమవారం వెంకటాచలంలో జరిగింది. ఏఎంసీ చైర్మన్‌గా గాలి రామకృష్ణారెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌గా అరుణమ్మతోపాటు డైరెక్టర్లు బాధ్యతలు చేపట్టారు. వారిని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మనుబోలు: మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొండూరుసత్రం వద్ద సోమవారం వంతెనను బొలేరో వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు కృష్ణగిరికి చెందిన కార్తికేయన్ బొలేరో వాహనంలో కావలికి వెళుతున్నాడు. కొండూరుసత్రం వద్ద వాహనం అదుపుతప్పి వంతెనను ఢీకొనడంతో కార్తికేయన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అటువైపుగా వెళుతున్న లారీ డ్రైవర్లు వాహనంలో ఇరుక్కుని తీవ్ర గాయాలతో ఉన్న కార్తికేయన్‌ను బయటకు తీసి చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనంలో నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినతుల అందజేత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు.

⇨ కొడవలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు సమస్యలపై వినతులు సమర్పించారు. రీసర్వేలో తనకున్న భూమి కంటే అధికంగా నమోదు కావడంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నామని, నివేశన స్థలం మంజూరు చేసి ఆదుకోవాలని, రేషన్ కార్డులో తప్పులు దొర్లినందున ఇబ్బంది పడుతున్నామని.. ఇలా కొందరు వినతి పత్రాలు అందజేశారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తానని తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి హామీ ఇచ్చారు.

పేదలను కాదని.. ధనికులకు..

- ప్రభుత్వ భూమి ఇళ్ల స్థలాలుగా పంచేందుకు సిద్ధం
- ఇందులో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు
- అఖిలపక్షం నాయకుల అభ్యంతరం



డీటీ శివయ్యకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నేతలు

తోటపల్లిగూడూరు: అర్హులైన అనేకమంది పేదలు ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తుంటే అధికారులు మాత్రం ధనికులకు భూమిని పంచడానికి సిద్ధమవడంపై నరుకూరు పంచాయతీ అఖిలపక్షం నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వివరాలు.. నరుకూరు పంచాయతీలో సర్వే నంబర్ 1ఏ1, 1ఏ2లో 59 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. నరుకూరు - కోడూరు రహదారిలో నరుకూరు సెంటర్‌లో ఉన్న ఈ భూమి విలువ ప్రస్తుతం రూ.5 కోట్లు. గతంలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్ వేసి పక్కనే ఉన్న ఈ ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్లు వేశారు. అప్పట్లో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రెవెన్యూ అధికారులు ఆ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని సంబంధిత స్థలంలో హెచ్చరిక బోర్డు పెట్టారు. అయితే బరితెగించిన రియల్టర్లు బోర్డును ఇటీవల తొలగించారు. ఆ భూమిని ఎలాగైనా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేశారు. అధికార పార్టీ నేతల ఒత్తిడితో రెవెన్యూ అధికారులు ఈ ఐదుగురికి ఆ భూమిని ఇళ్ల స్థలాలుగా ఇచ్చేందుకు ఏ-1 నోటీసులను జారీ చేశారు. అయితే వారిది నెల్లూరు రూరల్ మండలం కావడం విశేషం. పైగా ధనికులు కావడంతో నరుకూరు పంచాయతీ అఖిలపక్షం నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ శివయ్యకు వినతిపత్రం అందజేసి రియల్టర్ల నుంచి ప్రభుత్వం భూమిని కాపాడాలన్నారు. ధనికులకు ప్రభుత్వ భూమిని పంచితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకొనేది లేదన్నారు. ఈ ప్రభుత్వ భూమిని పేదలకు పంచడమో, ఇతర ప్రజా ప్రయోజనాలకు వినియోగించడమో చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు నాయకులు వేగూరు శ్రీనివాసులు, వేగూరు వెంకయ్య, ఉడా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు



టీపీగూడూరు : మాచర్లవారిపాళెంలో..

తోటపల్లిగూడూరు: మండలంలోని మాచర్లవారిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. వివిధ అంశాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామల, సుమ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

⇨ పొదలకూరు: బిడ్డకు ఆరునెలలపాటు తల్లిపాలు పట్టాలని కో - లోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కిరణ్‌రిషిత అన్నారు. సోమవారం నర్సారెడ్డికాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో వారోత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, ఆరోగ్య శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్ రిషిత

⇨ వెంకటాచలం: మండలంలోని కనుపూరు గ్రామంలో సోమవారం వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాల కారణంగా బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతాడని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎం రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు వసంతకుమారి, పరమేశ్వరి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం : కనుపూరులో..

⇨ ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని మామిడిపూడి ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో వారోత్సవాలు జరిగాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంగమ్మ మాట్లాడారు. స్కూల్ టీచర్లు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, అంగన్‌వాడీ టీచర్లు పావని, లక్ష్మి, స్రవంతి, గంగాభవాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీచర్ విజయ్‌కుమార్

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన



మనుబోలు: ఫోన్‌లతో నిరసన తెలుపుతూ..

మనుబోలు: ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ ఫోన్లతో ఉపయోగం లేదని, అవి తమకు వద్దంటూ సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటాచలం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెహానా బేగం మాట్లాడుతూ ఫోన్‌లో మూడు, నాలుగు యాప్‌లు పనిచేయడం లేదన్నారు. రికార్డులను మాన్యువల్‌గానే రాస్తామన్నారు. ప్రభుత్వం స్పందించి కొత్త ఫోన్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటాచలం ప్రాజెక్ట్ అధ్యక్షురాలు లక్ష్మీకాంతమ్మ, కార్యదర్శి సుగుణమ్మ పాల్గొన్నారు.

⇨ కోవూరు : స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రస్తుత సమస్యల నేపథ్యంలో కొత్త మొబైల్ ఫోన్లు వెంటనే ఇవ్వాలని, తగిన వేతనం పెంచాలని, పని భారం తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.



కోవూరు : సీడీపీఓ కార్యాలయంలో..

స్మార్ట్ మీటర్లు వద్దంటూ నిరసన



కోవూరులో..

కోవూరు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ సీపీఎం నేతలు పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మామిళ్లపల్లి మోహన్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వెంటనే విరమించి, పెంచిన అదనపు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శేషయ్య, బుజ్జయ్య, బాబు, ఆఫ్రోజ్, హరి, సురేష్, సర్దార్, శ్రీనివాసులు, విజయకుమార్, చాన్‌బాషా, మోహన్, ఫాతిమ తదితరులు పాల్గొన్నారు.

⇨ బుచ్చిరెడ్డిపాళెం రూరల్: స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. దామరమడుగు, రేబాల, జొన్నవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఆ పార్టీ నాయకులు సోమవారం ఏఈలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు అమర్చడం వల్ల నష్టం తప్ప ఎలాంటి లాభం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకమరాజు, గండవరపు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.